క్లుప్తంగా

నేడు 'స్పందన'

కనగానపల్లి/బత్తలపల్లి: స్థానిక తహసీల్దార్, ఎంపీడీఓ కార్యాలయాల్లో సోమవారం స్పందన కార్యక్రమాన్ని నిర్వహిస్తామని తహసీల్దార్లు పీవీ రమణ, యుగేశ్వరి దేవి, ఎంపీడీఓ లక్ష్మీనారాయణ ఆదివారం తెలిపారు. మండల స్థాయి అధికారులంతా హాజరై ప్రజల నుంచి వచ్చే ఫిర్యాదులను స్వీకరించాలన్నారు.

నేడు వాహనాల వేలం

పుట్టపర్తి అర్బన్: పుట్టపర్తి రూరల్ పోలీస్ స్టేషన్ పరిధిలో వివిధ కేసుల్లో పట్టుబడిన 8 వాహనాలను ఎస్పీ రాహుల్ దేవ్ సింగ్ ఆదేశాల మేరకు సోమవారం ఉదయం వేలం వేయనున్నట్లు రూరల్ ఎస్‌ఐ బాబ్జాన్ ఓ ప్రకటనలో పేర్కొన్నారు. సీఐ జయానాయక్, సెబ్ అధికారుల ఆధ్వర్యంలో ఉదయం 11:30 గంటలకు ఒక ఈచర్, ఒక బొలెరో, ఆరు ద్విచక్ర వాహనాలను వేలం వేస్తామన్నారు. వేలంలో పాల్గొనే వారు ఆధార్, పాన్‌కార్డులతో పాటు 10 శాతం ధరావత్తు చెల్లించాలన్నారు.

అలసత్వం వహిస్తే చర్యలు

నల్లచెరువు: ఆయుష్మాన్ భారత్ సర్వేను వలంటీర్లు, సంబంధిత అధికారులు నిర్ణీత సమయంలో పూర్తి చేయాలని ఎంపీడీఓ శకుంతల ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. సచివాలయ సిబ్బంది విధి నిర్వహణలో అలసత్వం వహిస్తే శాఖాపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. సచివాలయ ఉద్యోగులు విధిగా డ్రెస్ కోడ్ పాటించాలన్నారు.

ఆర్‌జే రత్నాకర్‌కు సన్మానం



ఆర్‌జే రత్నాకర్‌ను సత్కరిస్తున్న ఉపాధ్యాయులు

పుట్టపర్తి అర్బన్: ప్రభుత్వ పాఠశాలల్లో విద్యాభ్యాసం చేస్తున్న పేద పిల్లల ఆరోగ్యం కోసం సత్యసాయి సెంట్రల్ ట్రస్ట్ సహకారంతో రాగి మాల్ట్ అందజేస్తుండటంతో సెంట్రల్ ట్రస్ట్ మేనేజింగ్ ట్రస్టీ ఆర్‌జే రత్నాకర్‌ను పుట్టపర్తి మండల ఉపాధ్యాయులు ఘనంగా సన్మానించారు. ఆదివారం ఆర్‌జే రత్నాకర్ స్వగృహంలో ఆయనకు దుశ్శాలువాలు కప్పి సత్కరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. రాష్ట్ర వ్యాప్తంగా లక్షలాది మంది పేద పిల్లలకు మంచి పౌష్టికాహారం అయిన రాగిమాల్ట్ అందజేయడం సంతోషంగా ఉందన్నారు. సత్యసాయి బాబా ఆశీస్సులతో నిర్విఘ్నంగా కొనసాగాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో కందుకూరి శివ, కోనంకి చంద్ర, ఎలెఫ్ఎల్ హెచ్ఎం రామక్రిష్ణ, బాబాయ్య, మహేష్, వెంగమనాయుడు, వెంకట్ సుధాకర్, లక్ష్మీపతి తదితరులు పాల్గొన్నారు.

రవూఫ్‌కు ఘన నివాళి

కదిరి టౌన్: మున్సిపల్ పరిధిలోని కుటాగుళ్లలో రవూఫ్ స్థూపానికి ఆదివారం నివాళులర్పించారు. కార్యక్రమంలో నాయకులు ఆర్ చంద్ర రామ్‌కుమార్, ఇండ్ల ప్రభాకర్‌రెడ్డి శ్రీరాములు తదితరులు పాల్గొన్నారు.

డాక్టర్ మదన్‌కుమార్‌కు సన్మానం

కదిరి టౌన్: భారతీయ సేవారత్న అవార్డు అందుకున్న డాక్టర్ మదన్‌కుమార్‌ను ఆదివారం ఆయన స్వగృహంలో అఖిల గాండ్ల తెలికల సంక్షేమ సంఘం నాయకులు పూలమాలలతో ఘనంగా సన్మానించారు. భవిష్యత్తులో మరిన్ని సేవలు అందించాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో ఉమ్మడి అనంతపురం జిల్లా గాండ్ల సంఘం అధ్యక్షుడు చింతకుంట రామయ్య, ఏపీ గాండ్ల కార్పొరేషన్ డైరెక్టర్ చెన్నంపల్లి లక్ష్మీ ఛరసయ్య, గవ్వల లక్ష్మీనారాయణ, భాస్కర్, గంగాధర్, శ్రీనివాసులు తదితరులు పాల్గొన్నారు.

కరాటేతో ఆత్మస్థైర్యం



బెల్టు గ్రేడింగ్ టెస్ట్‌లో పాల్గొన్న విద్యార్థులు

ధర్మవరం: కరాటేతో ఆత్మస్థైర్యాన్ని పెంపొందించుకోవచ్చని మల్టిస్టార్ ఆలిండియా బుడోఖాన్ కరాటే అకాడమి కరాటే మాస్టర్ ఇనాయత్‌బాషా తెలిపారు. పట్టణంలోని కొత్తపేట మున్సిపల్ బాలికల ఆవరణలో ఆదివారం బెల్ట్ గ్రేడింగ్ టెస్ట్ నిర్వహించారు. ఈ టెస్టులో 80 మంది విద్యార్థులు పాల్గొనగా.. ఇందులో ఉత్తమ ప్రతిభ కనబరిచిన 65 మంది విద్యార్థులకు ఎల్లో, ఆరెంజ్, గ్రీన్, బ్లూ, బ్రౌన్ బెల్టులు, ప్రశంసాపత్రాలు అందజేశారు.

100 మందికి వైద్య పరీక్షలు

ధర్మవరం: గుండె జబ్బులు రాకుండా ప్రతి ఒక్కరూ జాగ్రత్తలు పాటించాలని మున్సిపల్ కమిషనర్ మల్లికార్జున, వైస్ చైర్మన్ పెనుజూరు నాగరాజు, కిమ్స్ సవేరా ఆసుపత్రి వైద్యుడు నాగరాజు తెలిపారు. పట్టణంలోని ఆర్యవైశ్య కొత్త సత్రంలో ఆదివారం మున్సిపల్ వైస్ చైర్మన్ పెనుజూరు నాగరాజు ఆధ్వర్యంలో కిమ్స్ సవేరా ఆసుపత్రి వైద్యులు ఉచిత గుండె వైద్య శిబిరం నిర్వహించారు. వార్డు ప్రజల కోసం ఉచిత గుండె వైద్య శిబిరం నిర్వహించడం అభినందనీయమని కమిషనర్ మల్లికార్జున అన్నారు. వైద్య శిబిరంలో 100 మందికి జీఆర్‌బీఎస్, బీపీ, ఈసీజీ, 2డీ ఎకో పరీక్షలు చేశారు. కార్యక్రమంలో కౌన్సిలర్ శివ, సవేరా ఆసుపత్రి మేనేజర్ షెక్షావలి, సిబ్బంది లావణ్య, లలిత, భావన, సతీష్ తదితరులు పాల్గొన్నారు.

వైభవంగా వీరనారాయణస్వామి జాతర







బత్తలపల్లి: రామాపురం వీరనారాయణస్వామికి పూజలు చేస్తున్న దృశ్యం, బత్తలపల్లి: భవిష్యవాణి వినిపిస్తున్న అర్చకులు

ముదిగుబ్బ: ఆలయం చుట్టూ ఎడ్లబండ్లను తిప్పుతున్న దృశ్యం

బత్తలపల్లి: మండలంలోని రామాపురం గ్రామంలో ఆదివారం వీరనారాయణస్వామి జాతర వైభవంగా నిర్వహించారు. ఉత్సవ విగ్రహాలను ప్రత్యేక పూజా కార్యక్రమాల అనంతరం గ్రామంలో ఊరేగింపు నిర్వహించారు. అనంతరం సమీపంలోని చిత్రావతి నదిలోకి ఉత్సవ విగ్రహాలను తీసుకెళ్లి అక్కడ ప్రత్యేకాలంకరణలు చేశారు. ఎగువగుడి అర్చకులు కప్పల నరేంద్ర, రామప్ప, నారప్పలు దిగువగుడి అర్చకులు కప్పల నంద, నారాయణస్వామి, నాగన్న స్వామికి ప్రత్యేక పూజలు, అర్చనలు చేశారు. ఈ సందర్భంగా మండలంలోని వివిధ గ్రామాల నుంచి భక్తులు పెద్ద సంఖ్యలో తరలివచ్చారు. జాతరకు చుట్టుప్రక్కల గ్రామాల రైతులు తమ ఎడ్లబండ్లను, ట్రాక్టర్‌లను రంగు కాగితాలతో అలంకరించుకుని ఊరేగింపుగా స్వామి వద్దకు చేరుకున్నారు. వీరనారాయణస్వామి చుట్టూ ప్రదక్షిణలు చేయడం ఆనవాయితీ. స్వామికి కానుకలు సమర్పించారు. వీరనారాయణస్వామి ప్రధాన అర్చకులు కప్పల నరేంద్రకు, ఆత్మానందకు స్వామి (ఒళ్లోకి) వచ్చి భవిష్యవాణిని భక్తులకు వినిపించారు. ఈ ఏడాది చిన్నకుశాల, పెద్దకుశాల కార్తిలో వర్షాలు కురిసి, పంటలు బాగా పండుతాయన్నారు. వేరుశనగ, వరి పంటలకు ఎక్కువ బలం ఉందని వివరించారు. పశువులకు, మానవులకు ఎలాంటి కీడు ఉండదు. రామభజనలు చేసే గ్రామాలు బాగుంటాయని తెలిపారు. ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరుగకుండా ధర్మవరం రూరల్ సీఐ మన్సూరుద్దీన్ ఆధ్వర్యంలో ఎస్‌ఐ టీవీ శ్రీహర్ష సిబ్బందితో బందోబస్తు ఏర్పాటు చేశారు. కార్యక్రమంలో సర్పంచ్ బండి సరస్వతి, ఎంపీటీసీ సభ్యురాలు బండి రమణమ్మ, ఉపసర్పంచ్ బండి సుజాత, మాజీ సర్పంచ్ కప్పల నారాయణస్వామి, నారప్ప, లక్ష్మన్న, రామప్ప, లక్ష్మీనారాయణ, కప్పల నారప్ప, పెద్దప్ప, ఎల్లప్ప, నాగన్న, కప్పల పెద్దప్ప, కప్పల సూర్యనారాయణ, వ్యాపారం పెద్దప్ప, ఆదినారాయణ, సోమశేఖర్, బండి వీరనారప్ప, ప్రకాష్, రాము, ఎల్లప్ప, సన్నారాయణ తదితరులు పాల్గొన్నారు.

ఆకట్టుకున్న పన్నారపు బండి

బత్తలపల్లి: వీరనారాయణస్వామి జాతరకు రైతులు ఎద్దుల బండ్లను వివిధ అలంకరణలతో అలంకరించి జాతరకు తీసుకువచ్చి స్వామి చుట్టూ ప్రదక్షిణలు చేస్తారు. కాటమకుంట సమీపంలోని వీరసిద్ధేశ్వర ఆశ్రమం నుంచి ఆదివారం ఎద్దుల బండిని ఆశ్రమ నిర్వహకులు రవిస్వామి సంకేపల్లి సమీపంలోని వీరనారాయణస్వామికి వెళ్లారు. పెద్ద ఎత్తున డప్పులు, వాయిద్యాలతో, బాణాసంచా కాలుస్తూ ఊరేగింపుగా తరలివెళ్లారు.

సంకేపల్లి సమీపంలో..

ముదిగుబ్బ: మండల పరిధిలోని సంకేపల్లి సమీపంలో ఆదివారం వీరనారాయణస్వామి పరుష ఘనంగా జరిగింది. భక్తులు అధిక సంఖ్యలో ట్రాక్టర్లు, ఎడ్ల బండ్లలో వచ్చి ప్రదక్షిణలు చేసి మొక్కులు తీర్చుకున్నారు. హిందూపురం ఎంపీ గోరంట్ల మాధవ్ స్వామిని దర్శించుకున్నారు. ఎంపీపీ ఆదినారాయణ ఏర్పాటు చేసిన ఎడ్ల బండిలో ఎంపీ గోరంట్ల మాధవ్ ప్రదక్షిణలు చేశారు. అవాంఛనీయ సంఘటనలు చోటు చేసుకోకుండా ఎస్‌ఐ హేమంత్ కుమార్ ఆధ్వర్యంలో బందోబస్తు చేపట్టారు.

ముదిగుబ్బలో పెద్దమ్మ పరుష

మండల కేంద్రంలోని పాతూరులో నల్లలమ్మస్వామి గుడి వద్ద ఆదివారం పెద్దమ్మ పరుష ఘనంగా జరిగింది. జాగారం రాత్రి అమ్మవారి మూల విరాట్‌ను పల్లకీలో తీసుకెళ్లి నల్లలమ్మస్వామి గుడి వద్ద కొలువుదీర్చారు. మూడు రోజులు పాటు పరుష జరుగుతుంది.



ముదిగుబ్బ: పెద్దమ్మ దేవతను కొలువుదీర్చిన దృశ్యం

మార్కెట్ లోపల సుంకం వసూలు చేయొద్దు

ధర్మవరం: పట్టణంలోని ప్రభుత్వ ఆసుపత్రి, కాయగూరల మార్కెట్‌ను ఎమ్మెల్యే కేతిరెడ్డి వెంకటరామిరెడ్డి ఆదివారం సాయంత్రం ఆకస్మికంగా తనిఖీ చేశారు. కాయగూరల మార్కెట్‌లో రైతులు, చిన్న, పెద్ద వ్యాపారస్తులను ఎమ్మెల్యే కేతిరెడ్డి మాట్లాడించి వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. మీకు కేటాయించిన గదుల్లో మాత్రమే వ్యాపారాలు చేసుకోవాలని బయటకు సరుకులు తీసుకుని రావద్దని తెలిపారు. కాయగూరల మార్కెట్ లోపల ఎటువంటి సుంకం వసూలు చేయరాదని, బయట సుంకం వసూలు చేసుకోవచ్చని సూచించారు. వేలంపాటలో గదులు సొంతం చేసుకున్న వారి నుంచి బకాయిలు ఉంటే వాటిని త్వరితగతిన వసూలు చేయాలని మున్సిపల్ కమిషనర్ మల్లికార్జునను ఆదేశించారు. మార్కెట్‌ను ఎప్పటికప్పుడు శుభ్రంగా ఉంచాలన్నారు. అనంతరం ప్రభుత్వ ఆసుపత్రిని తనిఖీ చేశారు. ఆసుపత్రిలో రోగుల వద్దకు వెళ్లి వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఆసుపత్రికి వచ్చే రోగులకు ప్రేమతో పలకరించి వైద్యం అందించాలని వైద్యులకు సూచించారు. అనంతరం ఆసుపత్రిలోని ఔట్‌సోర్సింగ్ ఉద్యోగులు తమకు ఆరు నెలలుగా జీతాలు రాలేదని ఎమ్మెల్యేకు విన్నవించారు. సంబంధిత అధికారితో ఎమ్మెల్యే ఫోన్‌లో మాట్లాడారు. తక్షణమే జీతాలు అందించాలని ఆదేశించారు. కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ మల్లికార్జున, మున్సిపల్ వైస్ చైర్మన్ పెనుజూరు నాగరాజు, కౌన్సిలర్ గజ్జల శివ, వైద్యులు సుష్మారెడ్డి, వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.



సమస్యలను తెలుసుకుంటున్న ఎమ్మెల్యే కేతిరెడ్డి వెంకటరామిరెడ్డి

హంద్రీనీవా ద్వారా చెరువులన్నింటికీ నీరు

ఎన్‌పీకుంట: వచ్చే సంవత్సరం నుంచి హంద్రీనీవా కాలువ ద్వారా ప్రతి చెరువుకు శాశ్వతంగా నీరందిస్తామని ఎమ్మెల్యే డాక్టర్ పీవీ సిద్దారెడ్డి అన్నారు. ఆదివారం మండలంలోని వెలిచలమల, పడమర నడింపల్లి పంచాయతీల్లో నిర్మించిన హంద్రీనీవా కాలువ పనులను నాయకులతో కలిసి పరిశీలించారు. గోపాలపురం వద్ద నుంచి సుమారు 3 కి.మీ మేర కాలినడకన కాలువ గట్టుపై కలియ తిరుగుతూ కాలువలో నీటి ప్రవాహానికి అడ్డంకులను గుర్తిస్తూ ముందుకు సాగారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. గత నెల రోజులుగా కదిరి మండలం పట్నం నుంచి ప్రయోగాత్మకంగా నీటిని విడుదల చేశారన్నారు. ఇందులో భాగంగా తలుపుల, ఎన్.పీ.కుంట మండలాలలో నిర్మించిన హంద్రీనీవా కాలువలో ఎక్కడెక్కడ నీటి ప్రవాహానికి అడ్డంకులు ఉన్నాయో గుర్తిస్తున్నట్లు తెలిపారు. మరో వారం రోజుల్లో ఈ నీరు వెలిగల్లుకు చేరే అవకాశం ఉందన్నారు. కార్యక్రమంలో ఎంపీపీ ఈటె రాము, యూత్ కన్వీనర్ వేణుగోపాల్‌యాదవ్, ఈశ్వర్‌నాయక్, గోవిందునాయక్, రామసుబ్బారెడ్డి, గంగిరెడ్డి, ఈశ్వర్‌రెడ్డి, భాస్కర్‌రెడ్డి, రాజారెడ్డి, నారాయణ తదితరులు పాల్గొన్నారు.



హంద్రీనీవా కాలువ పనులను పరిశీలిస్తున్న ఎమ్మెల్యే డాక్టర్ పీవీ సిద్దారెడ్డి

ముగిసిన తిమ్మమాంబ ఉత్సవాలు

ఎన్‌పీకుంట: మండల పరిధిలోని గూటిబైలు గ్రామం తిమ్మమ్మమర్రిమానులో గత మూడు రోజులుగా నిర్వహించిన జాగరణ మహోత్సవాలు ఆదివారం ముగిశాయి. సుదూర ప్రాంతాల నుంచి అధిక సంఖ్యలో భక్తులు తరలి రావడంతో తిమ్మమ్మమర్రిమాను ప్రాంతం పరిసరాల్లో సందడి నెలకొంది. రాత్రంత జాగరణ చేసిన భక్తులు ఉదయం అమ్మవారికి నిర్వహించే గంధాభిషేకం కార్యక్రమంలో పాల్గొనడానికి క్యూ కట్టారు. సందర్శకులతో ఆటస్థలం సందడిగా మారింది. ఉత్సవాలకు ఆలయ కమిటీ సభ్యులు ప్రత్యేక ఏర్పాట్లు చేశారు. వివిధ సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు. మర్రిమాను ప్రాంతం అంతా విద్యుత్ దీప కాంతులతో వెలుగొందింది. ఉత్సవాల్లో ఎలాంటి అవాంఛనీయ ఘటనలు చోటుచేసుకోకుండా రూరల్ సీఐ శంకర్‌నాయక్, స్థానిక ఎస్‌ఐ సద్గురుడు సిబ్బందితో బందోబస్తు నిర్వహించారు. కార్యక్రమంలో సర్పంచ్ విష్ణుమూర్తి, ఆలయ కమిటీ సభ్యులు నారాయణ స్వామి, శ్రీనివాసులు, వెంకటనారాయణ, మనోహర్, కేశవ, లేపాక్షి, గ్రామ కన్వీనర్ సాంబశివ పాల్గొన్నారు.



అలంకరణలో తిమ్మమాంబ

భక్తిశ్రద్ధలతో పాలపొంగులు

బత్తలపల్లి: మండలంలోని సంజీవపురం కాటికోటేశ్వరక్షేత్రం, సంఘమేశ్వర క్షేత్రంలోనూ, మాల్యవంతం, రామాపురం, కోడేకండ్లలోని వీరనారాయణస్వామి, డి.చెర్లోపల్లి సిద్ధేశ్వరాలయం, దంపెట్ల చెన్నకేశవాలయం, ముష్ఠూరు, పోట్లమర్రి శివాలయం, గంటాపురం అప్పస్వామి దేవాలయాలు మాఘ మాసం దీక్షలు చేపట్టిన మహిళలతో చివరి ఆదివారం కిటకిటలాడాయి. ఆయా గ్రామాల్లోని ఆలయాల వద్ద కుటుంబ సభ్యులతో కలిసి భక్తిశ్రద్ధలతో పాల పొంగులు నిర్వహించారు. ఆదివారం తెల్లవారుజామునే దేవాలయాలకు వెళ్లి ప్రదక్షణల అనంతరం కొత్త కుండలో నైవేద్యం చేసి, పూజలు చేశారు.



సంజీవపురం కాటికోటేశ్వరక్షేత్రంలో పాలపొంగులు చేస్తున్న మహిళలు

ఆలయానికి మైక్‌సెట్ వితరణ

ఎన్‌పీకుంట: మండల పరిధిలోని దిగువతూపల్లి గ్రామంలోని ఆంజనేయస్వామి ఆలయానికి సాయిరాం ట్రస్ట్ ఆధ్వర్యంలో మండల కేంద్రానికి చెందిన మాజీ సర్పంచ్ సాంబశివారెడ్డి, వెంకటరమణమ్మ రూ.15 వేలు విలువ చేసే మైక్‌సెట్ అందజేశారు. తమ కుమారుడు సాయిరాంరెడ్డి వర్ధంతి సందర్భంగా సాయిరాం ట్రస్టు తరఫున పలు సేవా కార్యక్రమాలు చేపట్టామన్నారు.ఇందులో భాగంగా స్థానిక తహసీల్దార్ కార్యాలయానికి రూ.6 వేలు విలువ చేసే 10 కుర్చీలు, జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో విద్యార్థులకు నీటి సౌకర్యార్థం రూ.4 వేలు విలువ చేసే మోటర్ అందజేశామన్నారు.

ముత్యాలమ్మకు పూజలు

రామగిరి: నసనకోట ముత్యాలమ్మ ఆలయంలో శుక్రవారం ప్రత్యేక పూజలు నిర్వహించినట్లు ఆలయ ఈఓ వెంకటేశ్వర్లు తెలిపారు. ఉదయాన్నే అమ్మవారిని ప్రత్యేకంగా అలంకరించి, పూజలు చేశారు. జిల్లావాసులేగాక, కర్ణాటక ప్రాంతవాసులు తరలివచ్చి కానుకలు సమర్పించి, మొక్కులు తీర్చుకున్నారు. ప్రతి ఆది, మంగళ, శుక్రవారాల్లో దేవదాయశాఖ ఆధ్వర్యంలో అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించనున్నట్లు తెలిపారు.

ఆలయాల్లో అన్నదానం



గంటాపురంలో అన్నదానం చేస్తున్న దృశ్యం

బత్తలపల్లి: శివరాత్రి పండగను పురస్కరించుకుని మండలంలోని ఆలయాల్లో సందడి నెలకొంది. సంఘమేశ్వరం, బత్తలపల్లిలో నాటక ప్రదర్శనలు ఏర్పాటు చేయడంతో భక్తులు వాటిని తిలకిస్తూ జాగారణ చేశారు. పలుచోట్ల భక్తులకు అన్నదానం చేశారు. ఉత్సవ విగ్రహాలను పురవీధుల్లో ఊరేగించారు. పోట్లమర్రిలోని శివాలయంలో శివుడు, శివరాత్రి విశిష్టత వివరించారు.

ధర్మవరం రూరల్: శివరాత్రి పర్వదినాన్ని పురస్కరించుకొని మండల పరిధిలోని పోతుకుంట గ్రామంలోని శివాలయం వద్ద ఆదివారం భక్తులకు అన్నదానం చేశారు. శనివారం రాత్రి శివాలయంలో ప్రత్యేక పూజలు, అభిషేకాలను నిర్వహించారు. తెల్లవారుజాము వరకూ భక్తులు భజనలు, కీర్తనలు ఆలపించారు.

కాలభైరవస్వామి ఆలయంలో

ధర్మవరం అర్బన్: పట్టణంలోని రేగాటిపల్లి రోడ్డులో ఉన్న ఆదివారం వైఎస్సార్‌సీపీ వార్డు ఇన్‌చార్జ్ కోటిరెడ్డి బాలిరెడ్డి ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం అన్నదాన కార్యక్రమాన్ని ఏర్పాటు చేయించారు.

వాలీబాల్ టోర్నీ విజేత నల్లమాడ



విజేత జట్టుకు నగదు బహుమతి అందజేస్తున్న దృశ్యం

నల్లమాడ: మహా శివరాత్రి సందర్భంగా స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల మైదానంలో శని, ఆదివారాల్లో రెండు రోజుల పాటు మండల స్థాయి వాలీబాల్ టోర్నమెంట్ నిర్వహించారు. ఇందులో నల్లమాడ, కురుమాల, నల్లమాడ జూనియర్ జట్లు విజయం సాధించి మొదటి మూడు స్థానాల్లో నిలిచాయి. మొదటి బహుమతి కింద నల్లమాడ జట్టుకు రూ.10 వేల నగదును వ్యాపారి డుంగావత్ రమేష్ నాయక్ సమకూర్చగా వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ కుళ్లాయినాయక్ జట్టు సభ్యులకు అందజేశారు. అలాగే ద్వితీయ బహుమతిగా కురుమాల జట్టుకు రూ.7 వేల నగదును స్థానిక శ్రీసాయి ఫర్టిలైజర్స్ యజమాని గోపాలయ్య, తృతీయ బహుమతిగా నల్లమాడ జూనియర్ జట్టుకు సాయి సప్తగిరి కళ్యాణ మండపం నిర్వాహకులు హరి అందజేశారు. బహుమతులు అందజేసిన దాతలకు, గ్రామస్తులకు క్రీడాకారులు కృతజ్ఞతలు తెలిపారు.

ఘనంగా ఛత్రపతి శివాజీ జయంతి

ధర్మవరం అర్బన్: స్థానిక సాలేవీధిలో ఉన్న అంబాభవానీ ఆలయంలో ఆదివారం ఛత్రపతి శివాజీ జయంతిని ఘనంగా నిర్వహించారు. ఛత్రపతి శివాజీ మహరాజ్ మరాఠా సంఘం, స్వకుల సాలే సంఘం, ఆలయ సంఘం ఆధ్వర్యంలో కౌన్సిలర్ కుండా చౌడయ్య, మాజీ మున్సిపల్ కో–ఆప్షన్ సభ్యులు ప్రకాష్, అనిల్ తదితరులు శివాజీ చిత్రపటాన్ని ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. పట్టణంలో ఛత్రపతి శివాజీ విగ్రహ ఏర్పాటుకు కృషి చేస్తామన్నారు. అనంతరం పట్టణ పురవీధుల్లో బైకు ర్యాలీ చేపట్టారు. గొట్లూరు గ్రామంలోని శివాజీ విగ్రహానికి క్షీరాభిషేకం చేశారు. అనంతరం అనాథాశ్రమంలో అనాథలకు అన్నదానం చేశారు. కార్యక్రమంలో సంఘం అధ్యక్షుడు గంగాధర్, కార్యదర్శి మరాఠి జాదవ్ హరి, సహ కార్యదర్శి నాగరాజు, గౌరవ అధ్యక్షుడు కృష్ణమూర్తిరాజా, జగదీష్, వెంకటేశులు తదితరులు పాల్గొన్నారు.



ఛత్రపతి శివాజీ చిత్రపటాన్ని ఆవిష్కరిస్తున్న దృశ్యం

పెద్దమ్మ తల్లికి పూజలు



అలంకరణలో పెద్దమ్మ

ధర్మవరం అర్బన్: పట్టణంలోని లక్ష్మీ చెన్నకేశవపురంలోని పెద్దమ్మ తల్లి ఆలయంలో ఆదివారం అమ్మవారిని ఆభరణాలతో అలంకరించారు. ఉత్సవ బోనాల సందర్భంగా భక్తులు పెద్ద ఎత్తున తరలివచ్చి, మొక్కులు తీర్చుకున్నారు. 21వ తేదీన అమ్మవారికి బోనాలు సమర్పించడంతో ఉత్సవాలు ముగుస్తాయని ఆలయ పూజారి పెద్దన్న తెలిపారు.

ఘనంగా మల్లేశ్వరస్వామి రథోత్సవం



ప్రత్యేక అలంకరణలో శివపార్వతులు

కనగానపల్లి: కనగానపల్లిలోని అతకల్లపట్నం మల్లేశ్వరస్వామి రథోత్సవ కార్యక్రమాన్ని ఆదివారం వైభవంగా నిర్వహించారు. కార్యక్రమంలో కనగానపల్లి, యలకుంట్ల, నెమలివరం గ్రామాల్లోని శివభక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించి శివపార్వతులను ప్రత్యేకంగా అలంకరించిన రథంపై ఊరేగింపు చేశారు. తర్వాతా గొరవయ్యల పాలు పట్టే కార్యక్రమాన్ని నిర్వహించారు. అనంతరం మాలగొండ్ల వంశస్తులతో ఆడబిడ్డలకు వడిబియ్యం పెట్టే కార్యక్రమాన్ని చేపట్టారు. యలకుంట్లలోని అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించారు.

లారీని ఢీకొని వ్యక్తికి గాయాలు



చికిత్స పొందుతున్న ఇమాములు

ధర్మవరం అర్బన్: పట్టణంలోని లక్ష్మీచెన్నకేశవపురం వద్ద ఆదివారం ఉదయం జరిగిన రోడ్డు ప్రమాదంలో వ్యక్తికి తీవ్ర గాయాలయ్యాయి. పోలీసులు తెలిపిన వివరాల మేరకు.. పట్టణంలోని ఇందిరమ్మ కాలనీకి చెందిన ఇమాములు ద్విచక్ర వాహనంలో పట్టణంలోకి వస్తుండగా.. లక్ష్మీచెన్నకేశవపురంలోని పెట్రోల్ బంకు వద్దకు రాగానే ఎదురుగా వస్తున్న లారీని ఢీకొన్నాడు. ఈ ప్రమాదంలో ఇమాములు తీవ్రంగా గాయపడగా స్థానికులు ఆటోలో ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. వైద్యులు ప్రథమ చికిత్స చేశారు. పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

వ్యవసాయ పరికరాల దగ్ధం



కాలి బూడిదైన షెడ్డు

పుట్టపర్తి అర్బన్: మండల పరిధిలోని సాహెబ్ చెరువు పక్కన ఉన్న కొండ ప్రాంతంలో గుర్తు తెలియని వ్యక్తులు నిప్పు పెట్టడంతో వ్యవసాయ పొలంలోని పరికరాలు కాలిపోయినట్లు కర్నాటకనాగేపల్లికి చెందిన మహిళా రైతు నరసమ్మ ఆవేదన వ్యక్తం చేసింది. 2.5 ఎకరాల్లోని డ్రిప్పు పైపులు, స్ప్రింక్లర్ పైపులు దగ్ధమైనట్లు తెలిపింది. వ్యవసాయ పనిముట్లు వేసుకొనే షెడ్డు సైతం కాలిపోయి నష్టం వాటిల్లిందన్నారు. కొండలకు నిప్పు పెట్టకుండా గొర్రెల కాపర్లను కట్టడి చేయాలన్నారు.

చల్లగా చూడు.. కాటికోటేశ్వరా



కాటికోటేశ్వరుడి విగ్రహాలను ఊరేగిస్తున్న దృశ్యం



ఉత్సవంలో పాల్గొన్న భక్తులు

తాడిమర్రి: మహాశివరాత్రిని పురస్కరించుకుని చిల్లవారిపల్లి కాటికోటేశ్వర క్షేత్రంలో శనివారం ప్రారంభమైన ఉత్సవాలు ఆదివారం అంగరంగ వైభవంగా ముగిశాయి. చిల్లవారిపల్లి గ్రామానికి చెందిన ఆలయ గ్రామ కమిటీ ఆధ్వర్యంలో ఆదివారం ఉత్సవాలను ఘనంగా నిర్వహించారు. వేలాదిగా తరలి వచ్చిన భక్తులు కాటికోటేశ్వరసామికి ప్రత్యేక పూజలు చేసి మొక్కులు తీర్చుకున్నారు. శివనామ స్మరణతో ఆలయ పరిసరాలు మార్మోగాయి. చిల్లవారిపల్లి గ్రామం నుంచి తెచ్చిన కాటికోటేశ్వరుడి ఉత్సవ విగ్రహాలు, ఆభరణాలను గదాగుండం దగ్గర కొలువుదీర్చారు. అనంతరం ప్రత్యేకంగా అలంకరించిన ఉత్సవ విగ్రహాలను డప్పుల వాయిద్యాలతో దేవాలయం వరకూ ఊరేగింపు నిర్వహించి, అగ్నిగుండ ప్రవేశం చేయించారు.

భక్తులు ముందుగా గదాగుండంలో పుణ్యస్నానాలు ఆచరించి కాటికోటేశ్వరుడితో పాటు కాశీ నుంచి తెచ్చిన శివలింగానికి, కొండపై గుహలో వెలసిన అక్కమ్మగార్ల దేవతలకు పూజలు చేశారు. ఉమ్మడి అనంతపురం, వైఎస్సార్ జిల్లాల నుంచి కర్ణాటక రాష్ట్రం నుంచి కూడా అధిక సంఖ్యలో భక్తులు తరలివచ్చారు. ఉత్సవాలకు విచ్చేసిన భక్తులకు దాడితోట గ్రామ పెద్దల ఆధ్వర్యంలో అన్నదాన కార్యక్రమం ఏర్పాటు చేశారు. ఉత్సవాల్లో ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు జరుగకుండా ముదిగుబ్బ సీఐ కంబగిరి రాముడు తాడిమర్రి, బత్తలపల్లి ఎస్ఐలు డి.లక్ష్మీనారాయణ, టీవీ శ్రీహర్ష సిబ్బందితో భారీ బందోబస్తు ఏర్పాటు చేశారు.